# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక




## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

–జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:– 9705770909 సంప్రదించండి.



సంచిక : 88 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | గురువారం | 26-6-2025 | వెల : .రూ. 5.00





## సెప్టెంబర్ 30లోగా

# స్థానిక ఎన్నికలు

### కీలక తీర్పు వెల్లడించిన హైకోర్టు

- స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగిన అనిశ్చితి
- మూడు నెలల్లో ఎన్నికల నిర్వహణ పూర్తి చేయండి
- రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు ఆదేశం


**హైదరాబాద్ జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి తొలగింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. గత కొంత కాలంగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు -మిగతా 2 లో



## ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

- కావాలనే కొందరు దీనిని తక్కువ చేసే యత్నం
- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్ జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇరాన్‌పై జరిగిన అమెరికా వైమానిక దాడులు ఆ దేశ న్యూక్లియర్ సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయని డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. కానీ పలు మీడియా నివేదికల నేపథ్యంలో ఇరాన్.. న్యూక్లియర్ కార్యక్రమాన్ని కొన్ని నెలలు మాత్రమే వాయిదా వేశాయని -మిగతా 2 లో



### నేటి నుంచి నగరంలో

## బోనాల సందడి

- తొలిబోనం గోల్కొండతో ప్రారంభం
- నెలరోజుల పాటు బోనాల జాతర

**హైదరాబాద్,**
నేటి నుంచి ఆషాడం ప్రవేశంతో జంటనగరాల్లో బోనాల సందడి మొదలు కానుంది. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి -మిగతా 2 లో

### తెలంగాణలో విద్యావ్యవస్థ

## మరింత పటిష్టం

### అదనపు కలెక్టర్లు పాఠశాలలను సందర్శించాలి

- కొత్తగా చేరుతున్న పిల్లలకు అనుగుణంగా సౌకర్యాల కల్పన
- విద్యార్థులకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలి
- అధికారులకు సూచించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 48 వేల మంది -మిగతా 2 లో

## బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటాం

- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్ జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చట్టపరంగా బనకచర్లను అడ్డుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ నెల 30వ తేదీన ప్రజాభవన్‌లో బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు ఎన్డీఎస్ఏ కన్‌స్టలెంట్‌గా -మిగతా 2 లో



### అంతరిక్షంలోకి అడుగుపెట్టిన

## శుభాంశు శుక్లా

- కెనడీ స్పేస్ సెంటర్ నుంచి అంతరిక్ష ప్రయోగం సక్సెస్
- స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ద్వారా మరో ముగ్గురితో కలసి ప్రయాణం

**న్యూఢిల్లీ,**
భారత వైమానిక దళ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, ఆక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా దూసుకెళ్లారు. దీంతో అతను మరో చరిత్ర సృష్టించారు. శుభాన్షు కక్ష్యకు చేరుకున్న రెండవ భారతీయుడు , అంతర్జాతీయ -మిగతా 2 లో

### కేసీఆర్ దమ్మేంటో

## కాంగ్రెస్ పార్టీకి తెలుసు

- రేవంత్ రెడ్డికి అబద్దాలు ఆడడం అలవాటైంది
- మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..?
- 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్ జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
: కేసీఆర్ దమ్మేంతా అన్నది ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీకి తెలుసు కాబట్టే తెలంగాణ వచ్చింది అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. తెలంగాణ వచ్చింది కాబట్టే ఇవాళ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అది మరిచిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడడం బాధాకరం -మిగతా 2 లో


### బనకచర్ల గురించి మాట్లాడే అర్హత

# కాంగ్రెస్‌కు లేదు

- బహిరంగ చర్చకు ఎక్కడికి రావాలో చెప్పండి
- లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదు
- మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమే
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్



**సిద్దిపేట జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బనకచర్ల ప్రాజెక్ట్ గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని చెప్పారు. -మిగతా 2 లో



### రహస్యంగా..ఖండాంతర బాలిస్టిక్

## క్షిపణులను అభివృద్ధి చేస్తున్న పాక్

- ఈ క్షిపణులు 5,500 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలవని సమాచారం

**పాకిస్థాన్ జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాకిస్థాన్ అత్యంత రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్షిపణులు 5,500 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఛేదించగలవని సమాచారం. ఈ మేరకు అమెరికా నిఘా -మిగతా 2 లో

# సెప్టెంబర్ 30లోగా స్థానిక ఎన్నికలు

(మొదటి తరువాయి)

జరగకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఈ అంశంపై ఆరుగురు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం హైకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ తరఫున న్యాయవాదులు రిజర్వేషన్ల పక్రియ పూర్తి చేయడానికి కనీసం మరో 30 రోజుల గడువు అవసరం అని తెలపడంతో హైకోర్టు ఆ అభ్యర్థనని పరిగణనలోకి తీసుకుంది. దీనితో రిజర్వేషన్ల పక్రియ పూర్తయిన తర్వాత, ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు కావాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యర్థనకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. దీనివల్ల కలిపి గరిష్ఠంగా 90 రోజుల లోపుల ఎన్నికల పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనితో, 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై పడనుంది. స్థానిక పాలన లోపిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు లేని పాలన వల్ల గ్రామీణాభివృద్ధి ఇబ్బందిగా మారుతుందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, పథకాల అమలు జాప్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు కోర్టుకు విన్నపించుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన పక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరు స్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి' అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల పక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల పక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. పక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ.. రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

## ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

(మొదటి తరువాయి)

చెబుతున్నాయి. ఈ నివేదికలను ట్రంప్ నకిలీ వార్తలని తోసిపుచ్చారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు. ఈ వార్తలు ప్రచురించే సీఎన్‌ఎన్, న్యూయార్క్ టైమ్స్‌లు కలిసి ఈ చారిత్రక విజయవంతమైన సైనిక దాడిని చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ సౌకర్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ మీడియా సంస్థలు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా ఈ నివేదికలను పూర్తిగా తప్పు అని తిరస్కరించారు. ఈ నివేదికలు ట్రంప్‌ను అవమానించేందుకు చేసిన ప్రయత్నమని ఆమె అన్నారు. 14 లక్షల కిలోల బాంబులను ఖచ్చితంగా లక్ష్యంపై వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసని అన్నారు. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఆఎం) నివేదిక ప్రకారం, జూన్ 22న అమెరికా ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ కేంద్రాలైన ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడులు జరిపింది. అయితే ఈ దాడుల్లో ఇరాన్ న్యూక్లియర్ ప్రధాన భాగాలను ధ్వంసం కాలేదని , కేవలం కొన్ని నెలల తర్వాత వాయిదా వేశారని ఈ నివేదిక చెబుతోంది. ఈ సౌకర్యాలకు నష్టం జరిగినప్పటికీ, ఇరాన్ న్యూక్లియర్ మౌలిక సౌకర్యాలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ షయంపై సమాచారం ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు, గుర్తింపు వెల్లడించకుండా, ఈ దాడులు ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ సౌకర్యాలకు నష్టం కలిగించినప్పటికీ, వాటిని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని చెప్పారు. ఇరాన్‌లోని అత్యంత సుసంపన్నమైన యురేనియం కొన్ని స్థలాల నుంచి దాడులకు ముందే తరలించబడి సురక్షితంగా ఉందని, సెంట్రిఫ్యూజ్‌లు కూడా చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఫోర్డోలోని లోతైన భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారం వద్ద ప్రవేశ ద్వారం కూలిపోయింది. మౌలిక సౌకర్యాలకు నష్టం జరిగింది. అయితే, భూగర్భంలోని ప్రధాన నిర్మాణాలు ధ్వంసం కాలేదని ఒక వ్యక్తి తెలిపారు. గతంలో జరిగిన అంచనాలు కూడా ఈ ఫలితాన్ని హెచ్చరించాయని ఆ వ్యక్తి చెప్పారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులు పూర్తి విజయవంతమయ్యాయని చెప్పినప్పటికీ, డిఐఏ నివేదిక వారి వాదనలను ఖండిస్తోంది. ఈ దాడులు ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమాన్ని గణనీయంగా దెబ్బతీసినప్పటికీ, దానిని పూర్తిగా నాశనం చేయలేకపోయాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నాయకుల వాదనలకు విరుద్ధంగా ఉంది. ఈ వివాదం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## అంతరిక్షంలోకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

(మొదటి తరువాయి)

అంతరిక్ష కేంద్రంకి ప్రయాణించిన మొదటి భారతీయుడు అయ్యారు. ఈ ప్రయోగం బుధవారం ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుండి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ద్వారా జరిగింది. ఆక్సియం-4 మిషన్ ఒక ప్రైవేట్ అంతరిక్ష విమాన వెంచర్. శుక్లాతో పాటు మరో ముగ్గురు అంతర్జాతీయ వ్యోమగాములు అంతరిక్షంలో చేరారు. శుభాన్షు అంతరిక్షయాత్ర భారతదేశ అంతరిక్ష కార్యక్రమంలో ఓ ముఖ్యమైన ఘట్టం. 41 సంవత్సరాల తర్వాత ఒ భారతీయుడు అంతరిక్షంలోకి ప్రయాణించడం ఇదే మొదటిసారి. 1984లో భారత వైమానిక దళ అధికారి, స్క్వాడ్రాన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి దూసుకెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. కజకిస్తాన్ నుంచి సోవియెట్ అంతరిక్ష నౌకలో సోయెజ్ -టి-11 అంతరిక్ష నౌకద్వారా అంతరిక్షంలోకి దూసుకెళ్లిన భారతీయుడు అయ్యాడు. నాలుగు దశాబ్దాల తర్వాత మరో అద్భుతం ఇది. శుభాన్షు శుక్లా కక్ష్యలోకి దూసుకెళ్లడం ద్వారా భారత అంతరిక్షచరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. అలాగే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం( ఐఎస్ ఎస్ ) ప్రయోగాలు చేస్తున్న మొదటి భారతీయపౌరుడిగా రికార్డులకు ఎక్కాడు, రాకేశ్ శర్మ చారిత్రాత్మక అంతరిక్షయాత్ర జరిగిన తర్వాత ఒక సంవత్సరానికి 1985లో జన్మించిన శుక్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కెప్టెన్, ప్రస్తుతం వ్యోమగామి. ఆక్సియమ్ స్పేస్ యాక్స్ -4 మిషన్లో భాగంగా ఎ÷-లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి స్పేస్ ఎక్స్ డ్రాగన్ అంతరిక్షనౌకను ప్రయోగించారు. బుధవారం ఫాల్కన్ -9 లోని మెర్లిన్ ఇంజన్లు నిప్పులు చిమ్ముకుంటూ స్పేస్ ఎక్స్డ్రాగ్రాన్ ను ఎర్త్ ఆర్బిట్ లోకి తీసుకెళ్లింది. నిర్దేశిరచిన ఖచ్చితత్వంతో ఫాల్కన్-9 డ్రాగన్ ను కక్ష్యలో ప్రవేశపెట్టింది. రెండోదశలో డ్రాగన్ మరింత ముందుకు దూసుకెళ్లి అంతరిక్ష ప్రయోగశాల వైపు సాగింది. ప్రయోగం ప్రారంభం కావడానికి ఓ గంటముందు శుక్లా, ఇతర వ్యోమగాములు తమతమ కుటుంబ సభ్యులకు వీడ్కోలు పలికారు. శుక్లా భార్య,పిల్లలు కూడా శుభాకాంక్షలు చెప్పారు. విఘ్నాలతో ఆలస్యమైన అంతరిక్ష ప్రయాణం కొన్ని విఘ్నాల కారణంగా మే 28నే జరగాల్సిన ఈ ప్రయోగం ఆలస్యం అయింది. సాంకేతిక లోపాలు,ఫాల్కన్ -9, డ్రాగన్ అంతరిక్ష నౌక, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వాతావరణ పరిస్థితులు, ఇలా ఎన్నో కారణాల వల్ల జాప్యం జరిగింది. నలుగురు వ్యోమగాములు దాదాపు నెల్లాళ్లపాటు నిర్బంధంలో ఉండాల్సివచ్చింది. స్పేస్ ఎక్స్, ఆక్సియమ్, నాసా, ఇస్రో నిపుణులు లోపలన్నింటినీ విజయవంతంగా చక్కదిద్దారు. ఎట్టకేలకు బుధవారంనాడు విజయవంతంగా ప్రయోగం జరిగింది. అంతరిక్ష ప్రయాణంలో విఘ్నాలు ఓ భాగం, మిషన్ ఆలస్యం అయినా యాక్స్-4 సిబ్బంది ఉత్సాహంగా అంతరిక్ష కేంద్రానికి సురక్షితమైన,విజయవంతమైన ప్రయాణంకోసం ఎదురు చూశారని మిషన్ కమాండర్ పెగ్గి విట్సన్ తెలిపారు. ఎఎక్స్ ? సిబ్బందితో డ్రాగన్ అంతరిక్ష నౌక ప్రస్తుతం భూమి నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని కలిసేందుకు నిర్దేశిరచిన భూ కక్ష్యలో తిరుగుతోంది. మిశన్ పైలట్ అయిన శుక్లా అంతరిక్ష కేంద్రానికి సాగుతున్న ప్రయాణాన్ని పరిశీలిస్తారు. గతంలో మిగ్ -21, మిగ్ -29, డోర్నియర్, ఎఎన్- 32, సుఖోయ్ -30వంటి పలు విమానాల టెస్ట్ పైలెట్ అయిన శుక్లా డ్రాగాన్ అంతరిక్ష నౌక పైలట్ గా కీలకపాత్ర వహిస్తున్నారు. భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లాను ఆయన అంతరిక్ష సహచరులు షుక్స్ అని వ్యవహరిస్తారు.

## రహస్యంగా..ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్న పాక్

(మొదటి తరువాయి)

సంస్థలు సంచలన విషయాలు వెల్లడించాయి. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత చైనా మద్దతుతో పాక్ తన అణ్వాయుధ సామగ్రిని అప్‌గ్రేడ్ చేయాలని భావించింది. అందుకు అనుగుణంగానే అత్యంత రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల అభివృద్ధి చేపట్టినట్లు వాషింగ్టన్ నిఘా సంస్థలు ఓ నివేదికలో వెల్లడించాయి. అమెరికాలోని పలు లక్ష్యాలను కూడా ఈ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు తాకగలవని తెలిపాయి. ఈ తరహా ఖండాంతర క్షిపణులను అభివృద్ధి చేయడం లేదా సమకూర్చుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తే, ఆ దేశాన్ని అణ్వాయుధ ప్రత్యర్థిగా గుర్తిస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేసినట్లు సదరు నివేదిక పేర్కొంది. పాకిస్థాన్ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను తయారు చేయడం గానీ, కొనుగోలు చేయడం గానీ చేస్తే.. ఆ దేశాన్ని వాషింగ్టన్ అణ్వస్త్ర ప్రత్యర్థిగా పరిగణించడం తప్ప వేరే మార్గం లేదు. అలాంటి క్షిపణులను కలిగి ఉన్న ఏ ఇతర దేశాన్నీ మిత్రదేశంగా పరిగణించదు' అని అమెరికా అధికారులను ఉటంకిస్తూ సదరు నివేదిక పేర్కొంది. కాగా, తమ దేశానికి ముప్పు కలిగించే అవకాశం ఉన్న లేదా అణ్వాయుధాలు కలిగిన ఏ దేశాన్నైనా అమెరికా తన ప్రత్యర్థిగా పరిగణిస్తుంది. ఇప్పటికే రష్యా, చైనా, ఉత్తర కొరియాలను అమెరికా తమ శత్రు దేశాలుగా పరిగణిస్తోన్న విషయం తెలిసిందే.

## బనకచర్ల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు

(మొదటి తరువాయి)

మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, కావాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. మళ్లీ పదేళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా రేవంత్‌రెడ్డి చేశారని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నిర్వహించడం లేదని ఆరోపించారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కి హరీష్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీష్‌రావు వెంట ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్‌ఎస్ శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అబద్దాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదామని అంటున్నారని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని.. తాను సిద్ధమని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రతి సవాల్ విసిరారు. ఏ టీవీలో కూర్చుందామో, ఎక్కడ మాట్లాడుదామో చెప్పు తాను రెడీ... రేవంత్‌రెడ్డి వస్తారో, మహేష్ కుమార్ గౌడ్ వస్తారో చెప్పాలని ప్రతి సవాల్ చేశారు. అసెంబ్లీ నిర్వహించడం చేతగాక రేవంత్‌రెడ్డి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు పూర్తిగా అధికారంలో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో విద్యావ్యవస్థ మరింత పటిష్టం

(మొదటి తరువాయి)

విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని సీఎంకు అధికారులు వివరించారు. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించాలని, గ్యాస్.. కట్టెల పొయ్యిల బాధ లేకుండా మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు సోలార్ కిచెన్లు ఏర్పాటుపై

వెంటనే దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణలవుతున్న విద్యార్థులకు, ఇంటర్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య తేడా ఎందుకు ఎక్కువగా ఉందని అధికారుల్ని ప్రశ్నించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ తర్వాత జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందొచ్చని, తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై సీఎం అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నగరంలో బోనాల సందడి

(మొదటి తరువాయి)

మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది. గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం వస్తుంది. దీంతో గోల్కొండ బోనాలతో సందడి మొదలు కానుంది. గురువారం మొదలు కానున్న ఈ సందడిలో భాగంగా ఆదివారం గోల్కొండ బోనాలు జరగనున్నాయి. బోనాలు సంప్రదాయం ప్రకారం ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోటలోని శ్రీఎల్లమ్మ (జగదాంబిక) ఆలయంలో ప్రారంభం కావడం ఆనవాయితీ. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో ఆమావాస్య తర్వాత వచ్చే గురువారం, లేదా ఆదివారం బోనాలు ప్రారంభవవుతాయి. అయితే, ఈ నెల బుధవారం అమవాస్య కావడంతో ఆ తర్వాత రోజు గురువారం బోనాల జాతర మొదలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇప్పటికే మంత్రి పొన్న ప్రభాకర్ సమీక్ష చేశారు. గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయాలు, బాడిగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు. పూజల ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి రోజు లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు.

## కేసీఆర్ దమ్మేంటో కాంగ్రెస్ పార్టీకి తెలుసు

(మొదటి తరువాయి)

అని కవిత అన్నారు. మహిళలకు రూ. 2500, పెన్షన్ల మొత్తం పెంపుపై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.

ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై అసెంబ్లీలోనే చర్చిద్దామన్నారు. రేవంత్ రెడ్డి చంద్రబాబును పిలిచి హైదరాబాద్ బిర్యాని పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదు. రేవంత్ రెడ్డికి అబద్దాలు ఆడడం అలవాటైంది. గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడం సరికాదు. యస్.. అసెంబ్లీ పెడుదాం ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసినదానిపై చర్చిద్దామన్నారు కవిత. రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలి. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు అని కవిత పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు రాశారు. అబిడ్స్ జీపీవోలో ఎమ్మెల్సీ కవిత, జాగృతి కార్యకర్తలు పోస్ట్ కార్డులను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ. 2 వేల పెన్షన్‌ను, రూ. 4 వేలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించింది. వికలాంగుల పెన్షన్‌ను రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పెంచకుండా కాంగ్రెస్ మోసం చేసింది. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..? గ్యారెంటీలపై సోనియా గాంధీ సంకతం పెట్టిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంచారు. సోనియాగాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులు మోసం చేశారు. అందుకే సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు పంపించాము. పెన్షన్ల మొత్తాన్ని పెంచాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలివ్వాలని సోనియా గాంధీని కోరామని కవిత పేర్కొన్నారు.

## బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటాం

(మొదటి తరువాయి)

వ్యహరిస్తోందని చెప్పారు. సత్వరమే నాగార్జునసాగర్‌లో పూడిక తీతకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. జలసౌధలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బనకచర్లతో సహా పలు కీలక అంశాలపై మంత్రి ఉత్తమ్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్‌ఎల్‌బీసీ పనులను పునరుద్ధరిస్తామని చెప్పారు. రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఇద్దరు సైనికాధికారులని కేటాయించామని తెలిపారు. టన్నెల్ నిర్మాణంలో నిష్ణాతులైన వారి నియామకానికి కసరత్తు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన టన్నెల్ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహరా జులైలో చేరారని తెలిపారు. నీటిపారుదల శాఖ సలహాదారుడిగా జనరల్ హార్బల్ సింగ్‌కు ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా జనరల్ హార్బల్ సింగ్ పనిచేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## 2025 జూన్ 26, గురువారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
అక్షేమర్శంజ్ జ్యేష్ఠమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం
తిథి
పాడ్యమీ: జూన్ 25, సాయంత్రం 4:01 నుంచి జూన్ 26, మధ్యాహ్నం 1:24 వరకు
ద్వితీయ (విధ్య): జూన్ 26, మధ్యాహ్నం 1:24 నుంచి జూన్ 27, ఉదయం 11:19 వరకు
నక్షత్రం
అర్ద: జూన్ 25, ఉదయాన్నే 10:40 నుంచి జూన్ 26, ఉదయం 8:46 వరకు
పునర్వసు: జూన్ 26, ఉదయం 8:46 నుంచి జూన్ 27, ఉదయం 7:21 వరకు
సూర్యోదయం - సాయంత్రం
ఉదయం 5:48
సాయంత్రం 6:49
చంద్రోదయం - చంద్రాస్తమయం
ఉదయం 6:18
సాయంత్రం 8:04
శుభకాలం
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:12-5:00
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:52-12:45
అమృతకాలం: ఉదయం 5:05-6:35
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 1:56-3:34
యమగండం: ఉదయం 5:48-7:25
గులిక: ఉదయం 9:03-10:41
దుర్ముహూర్తం: ఉదయం 10:08-11:00 & మధ్యాహ్నం 3:21-4:13
వర్జ్యం: రాత్రి 8:04-9:34


# దళిత సంక్షేమం పక్కనపెట్టిన ప్రభుత్వం: బోయిని అశోక్

డిహెచ్పిఎస్ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ నిధుల అష్టకష్టాలపై ఆవేదన



**కరీంనగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా దళితులకు ఒరిగిందేమీ లేదు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఎవరికీ చేరలేదంటే ఇది అధికార వైఫల్యానికి నిదర్శనం," అని డిహెచ్పిఎస్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బోయిని అశోక్ మండిపడ్డారు. బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఇండస్ట్రియల్ లోన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్, చెవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. "సంక్షేమ పథకాల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి. గ్రామ, మండల స్థాయిలో దళిత హక్కుల పోరాట సమితులను విస్తరించి సభ్యత్వ నమోదు కల్పించాలి" అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్నంది రాజకుమార్, బోయిని పటేల్, మహిళ నాయకురాలు శారద ఎస్. నాంపల్లి, అందే సంపత్, అందే వెంకట్, ఏ. పుల్లయ్య, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్ఐగా పదోన్నతి పొందిన మధుని సత్కరించిన ముప్పిడి సునీల్



**కరీంనగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ చిట్టంపల్లి మధు ఇటీవల ఏఎస్ఐ (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్)గా పదోన్నతి పొందిన సందర్భంగా ముంకమ్మ తోట మున్నూరు కాపు సంఘం కరీంనగర్ అధ్యక్షుడు ముప్పిడి సునీల్ ఆయనను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. సమాజానికి నిజాయితీగా సేవ చేస్తున్న మధు పదోన్నతితో గౌరవనీయ స్థానానికి చేరుకోవడం సంతోషకరమని ముప్పిడి సునీల్ పేర్కొన్నారు.

# లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా జూలూరు లింగయ్య



**ఆమనగల్లు, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు మాజీ అధ్యక్షుడు లయన్ జూలూరు లింగయ్య 2025 –26 సంవత్సరానికి జోన్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. 320ఏ జిల్లా ఎలక్ట్ గవర్నర్ లయన్ డా. జీ. మహేందర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరగింది. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూతమ జోన్ పరిధిలోని అన్ని క్లబ్‌ల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన నేతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలి

-ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి.
-పానుగల్లు గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం.
- పదవ తరగతి విద్యార్థులకు లెక్కలు నేర్పించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**పాన్గల్,జూన్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** వనపర్తి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బుధవారం పాన్గల్ మండలంలోని మాధవరావు పల్లి గ్రామపంచాయతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి 57 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 36 ఇళ్లకు ముగ్గులు పోసి 17 ఇళ్లు స్లాబ్ వరకు పూర్తి అయ్యాయి. ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. మిగిలిన వాళ్ళు నిర్మాణం ప్రారంభించలేదు కాబట్టి వారికి రద్దు చేసి అర్హత ఉన్న ఇతరులకు సిఫారసు చేయాలని మండల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. అనంతరం మాధవరావు పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నప్పటికినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబుద్ధులు నేర్పిస్తూ ప్రతి సంవత్సరం 5వ తరగతిలో గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందేవిధంగా చూడటం పై ఉపాధ్యాయుడు వీరస్వామి నీ కలెక్టర్ అభినందించారు. అంతకు ముందు పానగల్ గ్రామము ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో కొత్తగా చేరిన విద్యార్థులకు కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పానగల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాను సందర్శించారు. 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలలో 105 మంది విద్యార్థులు ఉండటం ఇంగ్లీష్ మీడియం ద్వారా నేర్చుకున్న పాఠాలను విద్యార్థులు చక్కగా చెప్పడం పై కలెక్టర్ అభినందించారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యా బోధనలు చేస్తే ఇలాంటి మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ ఉపాధ్యాయులను ప్రోత్సహించారు. విద్యార్థుల పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టడం, ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడటం, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు కలెక్టర్ కు వివరించారు. ఉపాధ్యాయుడు వెంకటేష్ ను సైతం కలెక్టర్ అభినందించారు. అనంతరం పానగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. గత సంవత్సరం 10 వ తరగతిలో ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాశారు? ఎంతమంది ఉత్తీర్ణత సాధించారు? పరీక్షలు రాసిన అమ్మాయిలు ఎక్కడ ఉన్నారు అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అమ్మాయిలకు బాల్య వివాహాలు చేసే ప్రమాదం ఉంటుందని అందువల్ల ప్రతి అమ్మాయి జూనియర్ కళాశాలలో చేరే విధంగా చూడాలని సూచించారు అనంతరం పదవ తరగతి అమ్మాయిలకు డిజిటల్ బోర్డు పై లెక్కలు నేర్పించారు. విద్యార్థులు అందరికీ అర్థమయ్యే వరకు లెక్కలు ఎలా చేయాలి, లాజిక్ ఎలా అర్థం చేసుకోవాలి అని బోధించారు. ఈ పాఠశాల నుండి మ్యాథమాటిక్ లో ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా విద్యా బోధన చేయాలని ఆదేశించారు. జిల్లా విద్యా అధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, పి.డి డిఆర్డీఓ ఉమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, తహసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ గోవింద రావు, మండల విద్యా అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలి: నడికూడా శివ



**కందుకూరు,జూన్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కందుకూరు మండలం, బేగరి కంచ గ్రామంలో అమెజాన్ కంపనీలో భూములు కోల్పోయిన కుటుంబాల నిరుద్యోగ, యువతీ, యువకులకు, అమెజాన్ కంపనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అమెజాన్ కంపనీ యాజమాన్యానికి మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయుసి అధ్యక్షులు నడికూడ శివ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కంపెనీ హెచ్ఆర్ స్పందించి రెండు రోజుల్లో ఉద్యోగ నియామకాలు చెపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువతీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా వేడుకలతో ఊరంతా ఉత్సాహం



**పెద్దపల్లి, జూన్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం జమ చేసినందుకు కృతజ్ఞతగా పెద్దపల్లి నియోజకవర్గంలో రైతు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంతో పాటు జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రాల్లో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ లీడర్లు, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అమావాస్య అన్న ప్రసాద వితరణ



**ఎల్బీనగర్ ,జూన్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** హస్తినాపురం ఆర్యవైశ్య మహాసభ సంఘం అధ్యక్షులు నీలా మధుసూదన్ గుప్త ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు తెలిపారు. బుధవారం అమావాస్య సందర్భంగా హైదరాబాద్ ఓంకార నగర్ బస్ స్టాప్ గణేష్ కిరాణం షాప్ ముందు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం అధ్యక్షులు గణేష్ గుప్త , ఆర్యవైశ్య మహాసభ మహాసభ సభ్యులు మహిళలు, యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భీమారంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన మంత్రి వివేక్



**భీమారం, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి గురువారం భీమారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ"ఇందిరమ్మ ఇళ్లు సామాన్య కుటుంబాల గృహకలలకు ప్రజాస్వామ్య ఫలితంగా నిలుస్తున్నాయి. నిరుపేదలకు స్థిరనివాస హక్కును కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధిశీలంగా పనిచేస్తోంది" అని పేర్కొన్నారు. "లబ్ధిదారుల చిరునవ్వే ప్రభుత్వ విజయానికి పరిపూరకం. అందరికీ సమానావకాశాలు కల్పించేందుకు ఈ పథకం కీలకం," అని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వృద్ధురాలిని ఆదుకున్న షాద్‌నగర్ సీఐ


ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రతిరూపంగా నిలిచిన విజయ్ కుమార్



**షాద్‌నగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై నిరాశ్రయంగా ఉన్న 80 ఏళ్ల వృద్ధురాలిని గుర్తించి ఆమెకు ఆశ్రయం కల్పించిన షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్ మానవత్వానికి పరమార్థంగా నిలిచారు. కుటుంబ సభ్యులు నిర్లక్ష్యంగా వదిలేసిన వృద్ధురాలిని నిన్న రాత్రి పెట్రోలింగ్ పోలీసులు గమనించి సీఐకి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సీఐ విజయ్ కుమార్, ఆమె వివరాలను సేకరించే ప్రయత్నం చేసినా పరిస్థితి చెప్పలేని స్థితిలో ఉండటంతో, లింగారెడ్డిగూడెం సమీపంలోని ఎఫ్పిఎన్ ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహకులతో సంప్రదించి ఆమెను అక్కడ చేర్పించారు. ఇంతకుముందూ అనేక మంది నిరాశ్రయులను ఓల్డ్ ఏజ్ హోమ్‌లకు తరలించిన సీఐ విజయ్ కుమార్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తున్నారని పట్టణ వాసులు ప్రశంసిస్తున్నారు. "దయగల హృదయమే భగవన్నిలయం" అన్న మాటకు జీవంత ఉదాహరణగా ఆయన సేవలను గుర్తించి ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## మిర్యాలగూడ ఏఐబీఎస్ఎస్ అధ్యక్షుడిగా నాగు నాయక్

-గిరిజన హక్కుల సాధనకు ముందుంటానన్న నూతన అధ్యక్షుడు



**మిర్యాలగూడ, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడిగా దామరచర్ల మండలం గణేష్‌పాడ్‌కు చెందిన కొర్ర నాగు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు సభవత్ రాములు నాయక్ నుంచి బుధవారం ఆయన నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నాగు నాయక్ మాట్లాడుతూ "నియోజకవర్గంలో దాదాపు 40 వేల గిరిజనుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాను. దాడులను తిప్పికొట్టేందుకు గిరిజన సమాజం ఐక్యంగా నిలవాలి," అని పేర్కొన్నారు. ఈ నెల 27న శాసన మండలి సభ్యులు కేతవత్ శంకర్ నాయక్ సన్మాన సభను తన అధ్యక్షతన విజయవంతంగా నిర్వహించాలని సిద్ధు నాయక్, దీరావత్ రవితేజ నాయక్ పిలుపునిచ్చారు. నాగు నాయక్ ఎన్నికపై రాష్ట్ర బంజారా ఉద్యోగుల సంఘం కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, గోపి నాయక్, మక్ల నాయక్, నెహ్రూ నాయక్, సైదా నాయక్, జామ్ల నాయక్లు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజల అందుబాటులో ఉంటున్న మంత్రి వివేక్

చెన్నూరులో వినతుల స్వీకరణ...
పోలీసుల గౌరవ వందనంతో ఆత్మీయ స్వాగతం





**చెన్నూరు, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చెన్నూరు పోలీస్ విభాగం తరఫున గౌరవ వందనం అందించారు. తర్వాత జరిగిన ముఖాముఖీ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తాగునీటి కొరత, రోడ్లు, పింఛన్లు, భూమి సమస్యలు తదితర సమస్యలను మంత్రికి వివరించారు. ప్రజల వినతులను ఓపికతో విని, తగిన శాఖలకు తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి డా. వివేక్ మాట్లాడుతూ "ప్రతి సమస్యపై స్పందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల ప్రభుత్వంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పనిచేస్తున్నాం" అని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, శాఖల ప్రతినిధులు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## బీసీ వృత్తుల ప్రదర్శన ప్రారంభించిన మంత్రులు





**హైదరాబాద్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న హెచ్ఎండిఏ గ్రౌండ్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ కులవృత్తుల వస్తు ప్రదర్శనశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఆయనతో కలిసి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పలు స్టాల్లను సందర్శించారు. మట్టి కుండలు, చెరకు కప్పులు, బాటిల్స్, మేధర బుట్టలు, చేనేత వస్త్రాలు, పూసల గాజులు, రాగి పాత్రలు, ఐరన్ పనిముట్లు, గొడ్డళ్లు, కత్తులు తదితర వృత్తి ప్రదర్శనలను పరిశీలించి హస్తవృత్తుల పరిరక్షణపై విశేషంగా ఆసక్తి చూపారు. "ఈ వృత్తుల అభివృద్ధే గ్రామీణ ఆత్మకథ," అంటూ ఆయన పేర్కొన్నారు.

## పాఠకులకు గమనిక:




**మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.**

**నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.**

**అన్నివేళలా మీతో పాటు ఉంటుంది**

**ఇమెయిల్:** neelagiriexpress@gmail.com

**సంప్రదింపు నెంబర్: 9705770909**

**మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.**

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

-అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవంలో మంత్రి లక్ష్మణ్ పిలుపు



**హైదరాబాద్, జూన్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం & అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని నెక్లెస్‌రోడ్డు జలవిహార్ నుంచి పీవీ విగ్రహం వరకు విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రవాణా %ఄ% బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాదకద్రవ్యాల వ్యతిరేకంగా ప్రజలతోపాటు ప్రతిజ్ఞ చేసి, డ్రగ్స్‌పై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. 'డ్రగ్స్ వాడకం యువతలో వేగంగా విస్తరిస్తోంది. శారీరక-మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూనే నైతిక విలువలను దిగజారుస్తోంది," అని మంత్రి లక్ష్మణ్ అన్నారు. ఈ క్రమంలో మిషన్ పరివర్తన పథకం కింద 66 మంది కమ్యూనిటీ ఎడ్యుకేటర్లను నియమించి రాష్ట్రవ్యాప్తంగా 3954 స్కూళ్లు, 494 గ్రామాల్లో 2956 అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, 2 లక్షల మంది పైగా ప్రజలకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించామని తెలిపారు. డీ-అడిక్షన్ సేవల కోసం ప్రభుత్వ నిర్వహణలో తెలంగాణలో మొట్టమొదటి డీ-అడిక్షన్ సెంటర్ ప్రారంభించారని, త్వరలో 23 జిల్లాల్లో జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేక చికిత్సా కేంద్రాలు, నాలుగు జైళ్లలో డీ-అడిక్షన్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జూన్ 20 నుంచి 26వ తేదీ వరకు 33 జిల్లాలో మదకద్రవ్యాల పై ప్రత్యేక అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. "తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులుప్రతి ఒక్కరు సచేతనంగా ముందుకొస్తేనే డ్రగ్ రహిత తెలంగాణ సాధ్యం," అని మంత్రి ఆకాంక్షించారు.

## విజయపురి ఎస్సీ కాలనీ పట్టించుకునే నాథుడు లేడు !



**కరీంనగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన రేకుర్తి 19వ డివిజన్ విజయపురి ఎస్సీ కాలనీ ప్రజలు పాలకుల నిర్లక్ష్యానికి బలైపోతున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రతినిధి, న్యాయవాది దుర్గం మారుతి నేతకాని ఆవేదన వ్యక్తం చేశారు. "దాదాపు 20 ఏళ్ల క్రితం వేసిన మోరి పైపు పగిలిపోయి ప్రస్తుతం తీవ్రమైన ప్రమాదానికి దారితీయనుంది. వృద్ధులు, పిల్లలు అజాగ్రత్తగా నడిస్తే కాలు విరిగే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. రోడ్లు కాలనీ స్థాపన నుంచీ ఉన్న స్థితిలోనే ఉన్నాయి. ఇది అభివృద్ధి అని చెప్పుకొనేవాళ్లు ఎదురుతిరగల నిర్లక్ష్య స్థాయిని చూపుతోంది" అని విమర్శించారు. "రేకుర్తి అభివృద్ధిలో కార్పొరేషన్ అధికారుల భాగస్వామ్యం లేదు. ఫిర్యాదు చేయకపోతే స్పందించని పరిస్థితి నెలకొంది. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి అధికారులవరకూ ప్రతినిధులుగా బీజేపీ తరఫున నిరంతరం కృషి చేస్తున్నాం" అని మారుతి నేతకాని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకుని సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన అందరూ బాధ్యతగా తీసుకోవాలి..

-షాద్ నగర్ సీఐ సి. విజయ్ కుమార్..




**షాద్ నగర్, జూన్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవం సందర్భంగా బుధవారం షాద్ నగర్ పట్టణంలో విశ్వభారతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో స్లోగన్ రైటింగ్, చిత్ర లేఖనం కాంపిటీషన్ నిర్వహించారు. నినాద రచన పోటీలలో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజెస్తామని తెలిపారు. ఈ సందర్భంగా షాద్ నగర్ పట్టణ సీఐ సి. విజయ్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు అలవాటుపడి యువత తమ మేధాశక్తిని వృథా చేసుకోకూడదన్నారు. డ్రగ్స్ ఒకసారి వాడినా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని యూత్ సోషల్ స్టేటస్, ఫ్యాషన్గా ఎంచుకుంటోందని, దీనిద్వారా విలువైన జీవితాలు నష్టపోతారని ఆయన అన్నారు. సహనం కోల్పోయి ఇతరులపై దాడులు, హత్యలు, దొంగతనాలాంటి నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. స్కూళ్లు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకుంటున్నా విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం 1098 నెంబర్ కి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్సై ప్రణయ్ కళాశాల బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 27న హైదరాబాదులో జరిగే ధర్నాను విజయవంతం చేయుండి...

### టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్...

**హైదరాబాద్, జూన్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే విధానాలను ప్రతిఘటిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపాధ్యాయులకు , విద్యాభిమానులకు పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక బీఈడీ కళాశాల ఆవరణలో ఈనెల 27న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించి ఉపాధ్యాయులతో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యా కార్పోరేటీకరణను, కాషాయీకరణను



ప్రోత్సహించే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని, పాఠశాల విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాన్ని మానుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్లో 10 శాతం రాష్ట్ర బడ్జెట్లో కనీసం 20% నిధులు విద్యకు కేటాయించాలని, రాష్ట్రంలో విదేశీ మరియు ప్రైవేటు విశ్వవిద్యాలయాలను అనుమతించకూడదని, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో తెచ్చిన 25 జీవో నిబంధనలను రద్దు చేయాలని,ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని ,నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిపాదన వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగంలో ఉన్న 30 వేల పాఠశాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని, అన్ని ప్రాథమిక పాఠశాలలో ప్రమాణాలు గల పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి అందుకు సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నాను ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతల లింగం డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవుల జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయరామరాజు టీటీయూ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ ఎస్ జి టి యు జిల్లా అధ్యక్షుడు రాము నరేందర్ శ్యామ్ నారాయణ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకున్న ఆత్మ బంధువులు..!

### -డీటీ రాజేష్ ఖన్నా కోసం తరలి వచ్చిన రెవెన్యూ బలగం
### -కష్టాల కడలిలో తోడై నిలిచిన ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి
### -మంగళ సూత్రాలను అమ్మి ఆస్పత్రి బిల్లులు చెల్లించాలనుకున్నా
### -జేఏసీ నేతలతో వాపోయినా రాజేష్ ఖన్నా భార్య రమాదేవి...

**హైదరాబాద్, జూన్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇంటికి పెద్ద దిక్కు అనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యాడు. అప్పుసప్పు చేసినా ఆస్పత్రి బిల్లులు చెల్లించలేని దుస్థితి. చివరకు మంగళ సూత్రాలనైనా అమ్మి ఆస్పత్రి బిల్లులు చెల్లించాలనుకుంది ఆ ఇంటి ఆవిడ. దిక్కుతోచని స్థితిలో కష్టాల కడలిలో ఉన్న ఆ కుటుంబానికి రెవెన్యూం బలగం తోడై నిలిచింది. ఇదంతా ఎవరిదో కాదు. ఓ మధ్య తరగతి రెవెన్యూ ఉద్యోగి గాథ. వరంగల్ జిల్లా, నల్లబెల్లి డిప్యూటీ తహశీల్దార్ రాజేష్ఖన్నా కుటుంబ ధీన పరిస్థితి. విషయం తెలుసుకున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. లచ్చిరెడ్డి, మిగతా సంఘాలైనా డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షంతో ఆస్పత్రికి వెళ్లి రాజేష్ ఖన్నాను పరామర్శించారు. అతడి కుటుంబానికి




ధైర్యం చెప్పడంతో పాటు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. బంజారాహిల్స్‌లోని విరంచి ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి బిల్లుల భారం కూడా లేకుండా చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రి నుంచి క్షేమంగా ఇంటికి వెళ్లె విధంగా చేశారు. ఇదే కాకుండా వాహనాన్ని కూడా ఏర్పాటు చేసి రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులుగా బాధ్యతతో పాటు మానవత్వాన్ని కూడా చాటుకున్నారు. మెరుగైన వైద్యం అందించడంతో పాటు బిల్లుల భారం లేకుండా చేసిన ఆస్పత్రి యజమాన్యానికి ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాకు దుఃఖ సాగరంలో పెద్దదిక్కుగా నిలిచారు..

**మీ రుణం మేము మర్చిపోలేము:**రాజేష్ ఖన్నా భార్య రమాదేవి వైద్య ఖర్చుల కోసం ఎంతో దుఃఖంతో చివరికి తన మంగళ సూత్రాలను అమ్మి హాస్పిటల్ బిల్లులు చెల్లించాలనుకున్నా. ఎటూ దిక్కు తోచలేదు. నా బాధని, కుటుంబ కష్టాల్ని వీడియో రూపంలో పంపించాను. దాన్ని చూసి తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక తక్షణమే ఆస్పత్రికి చేరుకున్నారు. ఏం భయ పడొద్దు, బాధ పడొద్దు మేమున్నాం మీకు తోడుగా అంటూ పెద్ద భరోసా ఇచ్చారు. అప్పుడు మా కుటుంబానికి కొండంత అండ దొరికినంత నమ్మకం వచ్చింది. ఆస్పత్రి యజమాన్యంతో మాట్లాడి రూ.7 లక్షల బిల్లులను మాఫీ చేయించారు. ఇంటికి క్షేమంగా చేరడానికి వాహనం ఏర్పాటు చేసి, నా భర్తకు పునర్జన్మని ఇచ్చి, నాకు నా కుటుంబానికి, నా పిల్లలకు కొండంత నిలిచారు. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణగారు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాణాల రామిరెడ్డి గారు, ప్రధాన కార్యదర్శి బిక్షంగారు, ఇతర నాయకులకు, మాకు అన్ని రకాలుగా చేయూతనిచ్చిన అన్నలకు, అక్కలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాను. మన అనుకున్న వాళ్లు కూడా అడిగితే సహాయం చేయలేని ఈ రోజులలో కేవలం నా వీడియోని చూసి వెంటనే స్పందించి నా దుఃఖాన్ని చూసి నా భర్తని కాపాడడానికి ముందుకు వచ్చిన మానవతామూర్తులకు రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ముఖ్యంగా హాస్పిటల్ యాజమాన్యం మా మా బాధలను, ఉద్యోగ సంఘాల వారు చెప్పిన కష్టాలను తెలుసుకొని సహాయం చేశారు.

# వంద రోజుల ప్రణాళిక ఏమైంది?

### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్ నగర్,జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్ వద్ద ఎస్ఎన్డిపి ( ఎస్ ఎన్ డి పిS) నాలా పనులను పర్యవేక్షించిన మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ:-మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో మొదటి దశ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని,రెండో దశకు సంబంధించిన నిధులు కూడా మంజూరు అయ్యాయని గుర్తు చేశారు.అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు.ప్రస్తుతం తిరిగి ప్రారంభించిన ఈ పనులు వచ్చే ఆరు నెలల్లో పూర్తవుతాయని అంచనా వేశారు.వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ముంపుకు గురి కాకుండా తాత్కాలికంగా కాంప్లెక్స్ నుంచి




అంబేద్కర్ నగర్ నాలాకు కలిపే మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అసోసియేషన్లతో చర్చించి సమ్మతించుకున్నట్టు తెలిపారు.కానీ ప్రధానంగా నాలాలోని చెత్త,మట్టిని తొలగించకుండా వదిలేయడం వల్ల ముంపు పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసారు.100 రోజుల ప్రణాళిక అంటూ ప్రజలను మభ్యపెట్టే బదులు,ప్రజా సమస్యలపై గైడ్లెన్స్ ఏమి ఉన్నాయి? అమలు దిశగా మీరు ఏ విధివిధానాలను చేపడుతున్నారు?"అంటూ తీవ్రంగా ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో లోకసాని కొండల్ రెడ్డి,ధర్పల్లి అశోక్,ఇంటూరి అంకిరెడ్డి,సుశీల రెడ్డి,గౌని శ్రీనివాస్ గౌడ్,రాజేష్, మహేందర్,రాజు యాదవ్,సునీల్ యాదవ్,అరుణ్ కుమార్,ఉత్తిపల్లి శ్రీనివాస్,హుడా కాంప్లెక్స్ సభ్యులు మల్లారెడ్డి,అనూప్ రాజా,సుధామా,సలీం, కిరణ్ కుమార్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు మీర్పేట్ మున్సిపల్ మొక్కలు నాటే కార్యక్రమం


### -ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి



**బాలాపూర్,జూన్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో బూతు అధ్యక్షులు మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది 156 157 బూతుల అధ్యక్షులు సత్యనారాయణ రావు సునంద శక్తి కేంద్ర ఇన్చార్జ్ స్థానిక మాజీ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమము న్యూ గాయత్రి నగర్ లో ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలన్ శంకర్ రెడ్డి, స్థానిక మీర్పేట 2 మున్సిపల్ అధ్యక్షులు తులసి ముఖేష్ సుల ప్రభాకర్ సోమేశ్వర్ గాజుల మధు సత్తయ్య సుధాకర్ కాశీరాం శ్రీనివాస్ మహాజన్ వేణుగోపాల్ రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి హైందవి అనిల్ ఈ కార్యక్రమం ఎమినేట్ స్కూల్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ఏసీబీ అధికారులకు పట్టుపడ్డ పోలీస్ అధికారి

**కల్వకుర్తి, జూన్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పోలీస్ స్టేషన్ పై ఏసీబీ అధికారుల దాడి చేశారు 10 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కిన రెండవ ఎస్ఐ రాంచందర్ జీ, కల్వకుర్తి మండలం , గుండూరు గ్రామానికి చెందిన నంబి వెంకటయ్య కు చెందిన భూవివాదం కేసు రాజీ కోసం 20 వేల రూపాయలు ఎస్సై డిమాండ్ చేయగా భాదితుడు ఏసీబీ ని ఆశ్రయించాడు , పథకం ప్రకారం గా 10 వేల రూపాయలు ఇస్తుండగా ఎస్సైని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.



## గిరిజన నాయకుల ఆధ్వర్యంలో.. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో..
రైతులకు న్యాయం జరుగుతుంది గిరిజన నాయకులు



**మహేశ్వరం జూన్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన ప్రతిష్టాత్మకమైన రైతు భరోసా పథకం లో భాగంగా రైతుల అకౌంట్లో రైతు భరోసా డబ్బులు జమ చేయడం సందర్భంగా మహేశ్వరం మండల గిరిజన నాయకుల సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని పాలాభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సునీత అంధ్యానాయక్ మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పండు నాయక్ ఝూన్సీరామ్ నాయక్ దసరు నాయక్ హర్యానాయక్ సురేష్ నాయక్ శ్రీను నాయక్ నాగేందర్ సురేష్ రవి నాయక్ లాలూ నాయక్ మున్యా నాయక్ శశికాంత్ పలువురు గిరిజ నాయకులు ఈ కార్యక్రమంలో పాలు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు.

## మందమర్రిలో 14 మంది డిపెండెంట్లకు ఉద్యోగ పత్రాలు

-సింగరేణి సంస్థ భవిష్యత్తు కోసం కృషి చేస్తాం: మంత్రి డా. వివేక్



**మందమర్రి, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి బుధవారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 14 మంది బొగ్గుగని కార్మికుల డిపెండెంట్లకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ"సింగరేణి సంస్థ లాభాల బాటలోకి రావడానికి కార్మికుల కృషి కీలకం. సంస్థ అభివృద్ధికి తగిన ప్రణాళికలతో ముందుకెళ్తాం. కొత్త గనులు, ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై దృష్టి సారిస్తాం," అని తెలిపారు. 'కార్మికుల సంక్షేమమే నా ప్రాధాన్యం. గతంలో కేంద్ర కార్మిక మంత్రిగా మా కాకా గారు డా. వెంకటస్వామి చేసిన సేవలు స్ఫూర్తిదాయకం. సింగరేణి సంస్థను నిలబెట్టిన వారిదే కార్మికుల గౌరవానికి పునాదులు" అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి జీఎం దేవేందర్, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కార్మిక నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఉద్యోగం లభించిన కుటుంబాలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## అవినీతి ఐకాన్లకు అభివృద్ధిపై మాట్లాడే హక్కు లేదు"

-మాజీ మేయర్ సునీల్ రావుపై బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు హరిశంకర్ విమర్శ



**కరీంనగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీలో చేరిన మాజీ మేయర్ సునీల్ రావు అవినీతి ఆరోపణలకు నిలువెత్తు దృష్టాంతమని, ఇటువంటి వారు మాజీ మంత్రి గంగుల కమలాకర్ అభివృద్ధిపై వ్యాఖ్యానించే హక్కే లేదని బీఆర్ఎస్ కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మండిపడ్డారు. 'అధికార దాహంతో పార్టీలను మార్చి, పదవుల ద్వారా సంపాదించినా%ొ% నమ్మిన నాయకులను వెన్నుపోటు పొడిచిన వాడే సునీల్ రావు. గతంలో బండి సంజయ్‌కి ఒక్క రూపాయి మంజూరు కాలేదన్న వాడే, ఇప్పుడు ఆయన అభివృద్ధి గొప్పతనాన్ని చెప్పడం హాస్యాస్పదం," అంటూ స్పందించారు. మేయర్‌గా ఐదేళ్ల వ్యవధిలో సునీల్ రావు చేసిన సంపాదనను, విదేశాల్లో కూడబెట్టిన ఆస్తులను త్వరలో భిన్న రూపంలో ప్రజల ముందు ఉంచతామని హెచ్చరించారు. "గంగుల కమలాకర్ చేసిన అభివృద్ధిని విమర్శించే స్థాయి నీది కాదు" అని హరిశంకర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. "కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ ఒక్క రూపాయి కూడా కరీంనగర్ అభివృద్ధికి తీసుకురాలేదు. ప్రజల గుండెల్లో మిగిలిపోయిన డంపింగ్ యార్డు సమస్యను కూడా పరిష్కరించలేదు. మాదిరిగా ఉన్న నేతలపై కాకుండా, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడం రాజకీయులకు నైతిక బాధ్యత" అని హితవు పలికారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసి డిమాండ్



**ఆమనగల్, జూన్ 25(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్ మున్సిపాలిటీ వర్కర్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు రామావత్ సక్రు నాయక్ మున్సిపాలిటీ కమిషనర్ ఎం. శంకర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సక్రు మాట్లాడుతూ"మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనం రూ. 25 వేలు ఇవ్వాలి. వారికి వారంలో ఒక్క సెలవు, అవసరమైన కిట్లు అందించాలి. ఇక కార్యనిర్వాహక స్తాయిలో పర్మినెంట్ చేయడమే ఈ వర్గానికి నిజమైన న్యాయం," అని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మొఘాలయ, జై విజయ, వెంకటమ్మ, జై లక్ష్మమ్మ, పెంటయ్య, రాములు, మహేందర్, శ్రీను, మహేశు, ప్రశాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 1.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే

**పెద్దపల్లి, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మంగళవారం జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి, వడ్కాపూర్ గ్రామాల్లో 1.14 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి, గృహ నిర్మాణాలకు ముగ్గు వేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్కాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, రైతు భరోసా కింద 9 రోజుల్లో ?9,000 కోట్ల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమైనందున ప్రభుత్వాన్ని అభినందించారు. "బీఆర్ఎస్ హయాంలో మోసపోయిన రైతన్నలకు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం



న్యాయం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇండ్లు మంజూరయ్యాయి. వచ్చే 3 సంవత్సరాల్లో 20 లక్షల ఇండ్ల లక్ష్యం ఉన్నది. నిరుపేదల ఇంటి కలను నిజం చేస్తున్నాం," అని అన్నారు. అలానే ?21,000 కోట్లు రుణమాఫీ, ?500 బోనస్‌తో సన్న వడ్ల కొనుగోలు, ప్రతి ఎకరానికి ?12,000 పెట్టుబడి సాయం, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ?10 లక్షల ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ?500లో గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాల అమలును వివరించారు. అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

-మెదక్ జిల్లా దండుపల్లిలో ఘోర ప్రమాదం



**మనోహరాబాద్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి శివారులో బుధవారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కూచిపూడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కుక్కదువ్వ మల్లేష్ (54), పెంజర్లకు చెందిన యాదగిరి వ్యవసాయ పనిముట్లు తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంలో మనోహరాబాద్ వైపు వెళ్తుండగా, యూటర్న్ తీసుకునే సమయంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ గరుడ బస్సు వారిని ఢీకొట్టింది. ఘటన స్థలానికే కుప్పకూలిన మల్లేష్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయపడ్డ యాదగిరిని మెరుగైన చికిత్స నిమిత్తం మేడ్చల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## కస్తూరిబాలో అదనపు హాస్టల్ గదులకు శంకుస్థాపన

బాలికల విద్యాభివృద్ధే సమాజ ప్రగతికి పునాది: మంత్రి డా. వివేక్



**భీమారం, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 82 లక్షలతో నిర్మించనున్న అదనపు డార్మెటరీ గదుల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ కార్మిక, గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ"బాలికలకు అనుకూల విద్యాపరిసరాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. సమాజంలో సమానత్వం ఏర్పడాలంటే బాలిక విద్య హేతువంతంగా అభివృద్ధి చెందాలి" అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యారంగంపై ప్రభుత్వ కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ



**ఎల్బీనగర్ , జూన్ 25 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
అమావాస్య అన్న ప్రసాద వితరణ సేవకై వాసవి ఫ్రెండ్స్ గ్రూప్ హస్తినాపురం ఆధ్వర్యంలో శ్రీ దుర్గా పోచమ్మ దేవాలయం వద్ద ఈస్ట్ హస్తినాపురం లో అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింతపల్లి సాయిసన్నిధి షిర్డీ సాయిబాబా ఆలయం ఫౌండర్ చైర్మన్ మంచికంటి ధనుంజయ గుప్త హాజరై అన్నప్రసాద వితరణ కార్యక్రమాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని దానాల కన్న అన్న ప్రసాద వితరణ గొప్పది అని ఆయన అన్నారు. పది మందికి అన్నప్రసాద వితరణ చేయడం వల్ల పుణ్యం కలుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సరబు రవి కుమార్ గుప్త, ఎర్రం భాస్కర్ గుప్త , తాళ్లపల్లి నాగభూషణం గుప్త, ప్రసాద్ గుప్త , ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.



సచివాలయం లో మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారులు మరియు చైర్మన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

## లతీఫ్ పాదయాత్రకు రెండేళ్లు

**జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) బైంసా ప్రతినిధి**
సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎంఏ లతీఫ్ పాదయాత్ర చేపట్టి నేటికీ రెండు సంవత్సరాల సందర్భంగా బైంసా పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంతి భవనం ముందు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు, జిల్లాస్థాయిలో లతీఫ్ చేసిన



పాదయాత్ర గతంలో ఎంతో ప్రాచుర్యం పొందింది, గత ప్రభుత్వ చేస్తున్న తప్పులను వెలికితీస్తూ ఆయన కొనసాగించిన పాదయాత్రతో ప్రజల్లో చైతన్యం నిండింది, ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, నాయకులు గంగారెడ్డి, ఓం ప్రకాష్ లడ్డ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు,

# 1975 ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు






**అధికార దురాశకు రాజ్యాంగాన్ని ఆపహరించిన రోజు: విద్యాసాగర్ రావు**

**కరీంనగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "జూన్ 25భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నటికీ మర్చిపోలేని చీకటి అధ్యాయం. అధికారాన్ని కాపాడుకునేందుకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, ప్రజల హక్కులకు తాళాలేసిన రోజు," అని మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కరీంనగర్ ఈఎన్ గార్డెన్స్‌లో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, 21 నెలల ఎమర్జెన్సీ కాలం దేశ ప్రజల జీవితాల్లో అనునిత్యం పీడకలలా మిగిలిందని గుర్తుచేశారు. "ఇది కేవలం రాజకీయ చర్య కాదు, రాజ్యాంగాన్ని అణగదొక్కే కుట్ర. మౌలిక హక్కుల రద్దు, ముందస్తు నిర్బంధాలు, మీడియాపై ఆంక్షలుఅన్నీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడానికే," అని స్పష్టం చేశారు. మీసా, డీఐఆర్ చట్టాలు, ప్రివెన్షన్ ఆఫ్ పబ్లికేషన్ చట్టం వంటి విధానాలు లౌకిక స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపాయన్నారు. ఇందిరాగాంధీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అలహాబాద్ హైకోర్టు తీర్పును జీర్ణించుకోలేకనే, రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసి ఎమర్జెన్సీ విధించారని చెప్పారు. "ఈ సమయంలోనే రాజ్యాంగంలో సెక్యులరిజం చొప్పించారు. ఇది సవరణ పేరుతో స్వార్థ వాడకమే," అని అన్నారు. "నేటి కరీంనగర్, ఒకప్పుడు ఎలగందుల జిల్లా%ౌ% ఉద్యమాలకు కేంద్రబిందువైంది. ఇకపై ఏ ఉద్యమమైనా ముందుండి నడిపించేందుకు నేను సిద్ధం," అని విద్యాసాగర్ రావు స్పష్టం చేశారు. 370 ఆర్టికల్ రద్దును కూడా కొందరు కలలో ఊహించలేకపోయారని, కానీ మోదీ సర్కార్ ఆ ధైర్యాన్ని చూపిందని కొనియాడారు. ఈ సందర్భంగా గతంలో ఎమర్జెన్సీ వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం గడిపిన కరీంనగర్ ప్రముఖులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, రాష్ట్ర నేతలు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, కన్నెబోయిన ఓదెలు, డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, కార్యకర్తలు గుర్రాల వెంకట్ రెడ్డి, దూలం కళ్యాణ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# కొండారెడ్డిపల్లి అభివృద్ధి పై కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష





**-ఎమ్మెల్యే వంశీకృష్ణ, కలెక్టర్ బాదావత్ సంతోష్ కీలక ఆదేశాలు**

**నాగర్‌కర్నూల్, జూన్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరింత వేగం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. వంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%ౌ% ప్రభుత్వ అభివృద్ధి కార్యాచరణలో భాగంగా మంజూరైన ప్రతీ పనిని ప్రాధాన్య క్రమంలోనే చేపట్టి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. గ్రామంలో చేపట్టిన రహదారి విస్తరణ, పాల శీతలీకరణ కేంద్రం నిర్మాణం, విద్యుత్ లైన్ల భూగర్భీకరణ వంటి పనులకు అత్యంత వేగం అవసరమని, ప్రతి విభాగం సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. గ్రామంలో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు వీధి లైట్ల ఏర్పాటుతో పాటు, సోలార్ ఆధారిత విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యా రంగాన్ని పురోగతికి ప్రాతినిధ్యం చేసే హంగులతో మలచాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కొండారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నామ నమోదు వంద శాతానికి చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల ఆవరణలోనే అంగన్వాడి కేంద్రం నిర్మాణం చేపట్టాలని, పిల్లల విద్యాభివృద్ధికి తగిన వాతావరణం కల్పించాలన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా షాపింగ్ కాంప్లెక్స్, లైబ్రరీ, బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ వంటి అవసరమైన సదుపాయాల భవనాల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వాటిని అమలు దశకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ వేగవంతం చేయాలని సూచించారు. మిషన్ భగీరథ కింద మంచి నీటి సరఫరా కోసం వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని, తద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ%ౌ% ముఖ్యమంత్రి స్వగ్రామంగా ఉన్న కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులపై ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉంది అని చెప్పారు. ఇప్పటికే అవసరమైన నిధులు మంజూరు చేయగా, అదనంగా చేపట్టిన పనులకు అవసరమైన అనుమతులను త్వరితగతిన తీసుకురావడానికి తాను ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గానికి కొత్త ఉత్సాహాన్ని, గుర్తింపుని తెచ్చే విధంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలను నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, విద్యుత్, రెడ్కో, నీటి సరఫరా, విద్యా, ఐసిడిఎస్ తదితర శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

# అచ్చంపేట ఏరియా హాస్పిటల్‌లో సమీక్ష సమావేశం

**వైద్య సేవలపై నిర్లక్ష్యం సహించం - ఎమ్మెల్యే వంశీకృష్ణ**



**అచ్చంపేట, జూన్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అచ్చంపేట పట్టణంలోని ఏరియా హాస్పిటల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్పిటల్‌కు వచ్చే ప్రతి రోగికి సమగ్ర వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులదేనని స్పష్టం చేశారు. చికిత్స విషయంలో నిర్లక్ష్యం కనిపించినా, రోగుల పట్ల సిబ్బంది అలసత్వంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్పిటల్ పరిసరాల్లో శుభ్రత తప్పనిసరి అని, దీనిపై ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, స్టాఫ్ నర్సులతో సమావేశమై ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. హాస్పిటల్‌లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలోనే 100 పడకల హాస్పిటల్‌లో అన్ని విభాగాల్లో అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సమన్వయకర్త రామకృష్ణ, హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ప్రభు, వైద్యులు మహేష్, ప్రదీప్, బాలాజీ, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

**-తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో వ్యవసాయం దండగ కాదు.. పండుగ**
**-వ్యవసాయం రైతాంగానికి 1,05,266 కోట్లు కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**-సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజులపల్లి నరసింహ గణపురం రాజు**




**మహేశ్వరం జూన్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కలుగుదీరిన ఏడాది ఉన్నారా కాలంలోనే అన్నదాతల ఆత్మ గౌరవాన్ని రైతుల చెమట చుక్కలకి ప్రజా ప్రభుత్వం అందించిన భరోసాగా అభివర్తొమ్మిది రోజులలోనే 9 వేల కోట్ల రూపాయలను సుమారు 70 లక్షల పదకొండు వేల 984 మంది రైతుల ఖాతాల్లో జమ చేసినందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి పట్ల ఆశిస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి మహేశ్వరం మండల కేంద్రంలో పాలాభిషేకం చేసిన అనంతరం రైతులకు మిఠాయిలు పంచుతూ రైతు భరోసా విజయోత్సవ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజులపల్లి నరసింహ, మరియు పెద్దపులి నాగారం గ్రామ శాఖ అధ్యక్షులు గణపురం రాజు, ఈ యొక్క కార్యక్రమంలో రైతులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది


# ఎమర్జెన్సీ చీకటి అధ్యాయాన్ని గుర్తు చేసిన విద్యాసాగర్ రావు



**కరీంనగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయంగా నిలిచిన ఎమర్జెన్సీ విధింపుకు 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సుకు ముందుగా, ఆయన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బీజేపీ నాయకులు జంగాల పెల్లి కుమార్, దేవిశెట్టి నవీన్, కొలిపాక శ్రీనివాస్, సోం మహేష్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. 25 ఏళ్ల అనంతరం కరీంనగర్‌కు వచ్చిన విద్యాసాగర్ రావు రాష్ట్ర రాజకీయాలపై పలుసమయాలు ముచ్చటించారు. తరువాత జరిగిన సభలో పాల్గొన్న ఆయన, "ఎమర్జెన్సీ కాలం భారత ప్రజాస్వామ్యానికి గాయాల్ని మిగిల్చింది. అలాంటి తత్వాలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని వ్యాఖ్యానించారు.

# జూలై 27 నుంచి సీసీ కెమెరాల ఆధారంగా ట్రాఫిక్ పర్యవేక్షణ

**-కరీంనగర్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలకు చలాన్లు సిద్ధం: కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్మార్ట్ సిటీ పథకం కింద కరీంనగర్ పట్టణంలో ఏర్పాటైన సీసీ కెమెరాలను జూలై 27 నుండి పూర్తిస్థాయిలో ఉపయోగించి ట్రాఫిక్ నిబంధనలపై పర్యవేక్షణ జరగనుందని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్తో కలిసి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఆయన, కెమెరాల పనితీరు, అనుసంధాన వ్యవస్థలను సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ"పౌరుల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ శాంతి ఏర్పాటు ప్రధాన లక్ష్యాలు. ప్రజలు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలి" అని విజ్ఞప్తి చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చలాన్ ఖాయం:**

- ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్
-హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం
-సీట్ బెల్ట్ లేకుండా కారు నడపడం
-రాంగ్‌సైడ్ డ్రైవింగ్
-సెల్‌ఫోన్ వాడుతూ వాహనం నడపడం
- ట్రిపుల్ రైడింగ్
-అతివేగం / ర్యాష్ డ్రైవింగ్

ఈ ఉల్లంఘనలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి తగిన చలాన్లు విధించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, ఖరీముల్లాఖాన్, రమేష్, వెంకటేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పుస్తకాల విక్రయంపై పిడిఎస్యు నిరసన


అక్షర స్కూల్‌పై చర్యలకు ఎంఈఓ హామీ



**వెల్దండ, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని అక్షర కాన్సెప్ట్ స్కూల్ వద్ద అనుమతి లేకుండా పాఠ్య పుస్తకాల విక్రయంపై పిడిఎస్యు విద్యార్థి సంఘం మంగళవారం నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ "ప్రైవేట్ స్కూళ్లకు పుస్తకాలు విక్రయించే హక్కు లేకున్నా%ొ% అక్షర స్కూల్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో బహిరంగంగా పుస్తకాలను అమ్ముతున్నారు. ఇది విద్యా నిబంధనలకు విరుద్ధం" అని విమర్శించారు. ఇతర ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఇలాంటివే జరుగుతున్నాయని, అధిక ధరలకు బుక్స్ విక్రయిస్తున్న వారిపై ఎంఈఓ తనిఖీ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించిన ఎంఈఓ చంద్రుడు స్కూల్ వద్దకు చేరుకొని స్థితిగతులు పరిశీలించారు. "స్కూల్ యాజమాన్యానికి నోటీసు జారీ చేస్తాం. బాధ్యులపై తగిన చర్యలు ఉంటాయి" అని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు కార్తీక్, నితిన్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయిలోనే బలమైన పునాది అవసరం

-రంగాపూర్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం




**వంగూరు, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండలంలోని రంగాపూర్ గ్రామంలో బుధవారం బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షురాలు కట్రావత్ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. "గ్రామస్థాయిలో పార్టీ బలాన్ని పెంచడమే విజయానికి పునాది. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి," అని నేతలు సూచించారు. ఉజ్వల యోజన, పీఎం ఆవాస్, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ వంటి సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో జనానికి వివరించాల్సిన అవసరాన్ని ముందుంచారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్, ఇన్‌చార్జి మదగని శ్రీనివాస్ గౌడ్, పార్లమెంటు అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, నాయకులు ఎల్లేని సుధాకర్ రావు, కట్ట సుధాకర్ రెడ్డి, మంగ్యానాయక్, ముక్తాల రేనయ్య, గంగిశెట్టి నాగరాజు, జానకి, బూత్ అధ్యక్షుడు సీతారాం నాయక్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ గురించి అవగాహన సదస్సు




**కల్వకుర్తి జూన్25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని డ్రగ్స్ గురించి వైఆర్ఎం కళాశాలలో మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల, గవర్నమెంట్ హైస్కూల్లో , కల్వకుర్తి డిఎస్పి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ గురించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా కల్వకుర్తి డిఎస్పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, బుధవారము కల్వకుర్తి పట్టణంలోని పలు కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం వాటి వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అధిక మంది డ్రగ్స్ కు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ప్రతి ఒక్కరు ఆలోచించి మత్తు బారిన పడకుండా ఉండాలని కోరారు. మిత్రులతో కలిసి సరదాగా డ్రగ్స్ అలవాటు చేసుకుని కొన్ని రోజుల తర్వాత దానికి బానిసలుగా మారిపోతున్నారని తెలిపారు. విద్యార్థులు చదువులపై దృష్టి సాధించి సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే1908 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ వెంకటరెడ్డి, ఎస్సై మాధవరెడ్డి శిక్షణ ఎస్ఐ గిరి మనోహర్, ఆయా విద్య విద్యాలయ ప్రిన్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల అడ్డగోలు వ్యాపారం






-అధిక ఫీజులు బలవంతపు బుక్స్ విక్రయాలు
-నాగర్‌కర్నూల్‌లో ఒక స్కూల్‌పై ఎంఈఓ తనిఖీ
- పుస్తకాలు సీజ్ చేసిన అధికారులు






**నాగర్‌కర్నూల్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని కొంతమంది ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మలుచుకుంటూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫామ్స్ వంటి విద్యాసంబంధి వస్తువులను తమే తయారు చేసినట్లు, తమ వద్ద నుంచే కొనాలని బలవంతంగా వేధింపులకు పాల్పడుతున్న దుస్థితి వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ స్కూల్‌లో పుస్తకాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎంఈఓ భాస్కర్ రెడ్డి అకస్మాత్తుగా ఆ పాఠశాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ఇవ్వాల్సిన పుస్తకాలకు సంబంధించిన బిల్లులను రక్షణగా ఉంచినట్లు గుర్తించారు. అంతేగాక, పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో పెద్దఎత్తున పుస్తకాలు నిల్వ చేసి ఉంచిన విషయాన్ని గుర్తించి, వెంటనే అధికారులతో కలిసి వాటిని సీజ్ చేశారు. పాఠశాల యాజమాన్యం ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే పుస్తకాలను విక్రయిస్తుండటం, బిల్లుల సక్రమ లిఖిత పద్ధతులు పాటించకపోవడం అధికారుల దృష్టిలోకి వచ్చింది. ఈ చర్యలపై విద్యా శాఖ అప్రమత్తమైంది. ఈ వ్యవహారంపై వివరణ కోరిన నీలగిరి ఎక్స్ ప్రెస్ ప్రతినిధులతో జిల్లా విద్యాధికారి (డీఈఓ) రమేష్ కుమార్ మాట్లాడుతూ, "ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల పేరుతో వ్యాపార దందాకు పాల్పడితే ఉపేక్షించము. ఎలాంటి అనుమతులు లేకుండా పుస్తకాలు, నోటుబుక్స్ అమ్మిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం," అని తెలిపారు. అలాగే అధిక ఫీజులపై వచ్చే ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకొని తగిన విచారణ జరిపి చర్యలు చేపడతామని చెప్పారు. తల్లిదండ్రులు చదువు కోసం ఎన్నో త్యాగాలు చేస్తుంటే, ప్రైవేట్ పాఠశాలలు వాటిని లాభాల మార్గంగా మలుచుకుంటుండటం బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు. విద్యను వ్యాపార పద్ధతిలో మలచిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థుల హక్కులను కాపాడాలంటూ వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహబూబ్ నగర్ లో అన్నప్రసాద వితరణ.

-పంపిణీ చేసిన సేవాభూషణ్ అవార్డు గ్రహిత నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్ గుప్త



**మహబూబ్ నగర్ , జూన్25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆకలితో వున్నవారికి ఆహారం అందిస్తే అది కడుపు నిండా తిన్నవారు కడుపు నిండాక అన్నదాత సుఖీభవ అని దివిస్తారు.డబ్బు రూపంలో ఎంత ఇచ్చిన తక్కువే ఇంకా కావాలా అని ఆశ ఉంటుంది .ఎంత సంపాదించినా జానెడు పొట్టకోసమే, కోటివిద్యలు కూటికోసమే అంటూ సేవాభూషణ్ అవార్డు గ్రహిత నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్ అన్నారు. పాలమూరు రైల్వేస్టేషన్ చౌరస్తాలో ఆకలితో వున్న కొందరికి తమ అమ్మ వరలక్ష్మి గారు వండిన వేడి వేడి ఆహారంతో ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎంతటి పెద్ద వారు ( కోటీశ్వరులు ) అయిన, పేద ( బీద ) వారైనా సరే జానెడు పొట్టకోసం కాసింత లవనం అన్నము ఆహారం తీసుకుంటాము. ఉన్నవారు పదిరకాల కూరలతో ఆహారం తీసుకుంటే, పేదవారు లేనివారు ఉప్పుకారము, చట్నీలతో కడుపు నింపుకుంటారు. మనము మనకు వున్న దానిలో నుంచి పేదవారికి డబ్బు రూపకంగా కాకుండా వస్తురుపకంగా ఇవ్వడం నేర్చుకోవాలి. మేము మాకు వున్న దానిలో నుంచి కాసింత పేదవారికోసం అన్నసంతర్పణ రూపములో ఆహారంతో ఆకలి తీరుస్తుంటాము, అపుడపుడు బట్టలు కూడా ఇవ్వడం జరుగుతుంది.అంతేకాక కరోనా సమయములో 13 రకాల నిత్యావసర వస్తువులను మరియు ప్రతినిత్యము సాయంత్రం సమయంలో వేడివేడి ఆహారమును స్వచ్ఛందముగా అందించడం జరిగింది.ప్రభుత్వ పాఠశాల మరియు అంగన్వాడీ కేంద్రములలోని పిల్లలకు స్వచ్ఛందముగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ అక్షరమాల పటాలను ఉచితంగా స్వచ్ఛందంగా అందించడం జరిగింది. చివరగా ఒక్క విషయం ప్రతిఒక్కరికి కుడు, గూడు, గుడ్డ అనేది తప్పనిసరి అవసరం.కుడు అంటే ఆహారం తింటేనే మనిషి అనేవారు ఏదో ఒకపని చేసుకుని జీవిస్తారు.ప్రతి ఒక్కరు మీకు ఎవరైనా ఆకలితో కనిపిస్తే వారి కడుపు నిండా భోజనం పెట్టలేకపోయినా కనీసం ఒక చిన్ని బిసికట్ ప్యాకెట్తో నైనా కాసింత ఆకలిని తీర్చండి అని అన్నారు.

# అల్ఫోర్స్ స్కూల్‌లో ఎన్నికల సందడి

ప్రజాస్వామ్య పాఠాలతో విద్యార్థుల్లో ఉత్సాహం



**కరీంనగర్, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి (హెచ్)లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో హౌస్ కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ ఎన్నికలు మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థాధినేత డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ "ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం. అమూల్యమైన ఓటు విలువను చిన్ననాటి నుంచే అర్థం చేసుకునేలా చేయాల్సిన అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు. పాఠశాల విద్యార్థులను లక్ష్య, తేజస్, ధృవ, సరన్ అనే నాలుగు విభాగాలుగా విభజించి బాలురు, బాలికలకు వేరువేరుగా నేతలను ఎన్నుకునేలా ప్రక్రియ జరగడం విశేషం. అభ్యర్థులు తమ గుర్తులతో తరగతుల మధ్య ప్రచారం నిర్వహించగా, ఓటింగ్ ప్రక్రియ హోరాహోరీగా సాగింది. ఎన్నికల ఫలితాల అనంతరం విజేతలకు ప్రత్యేక ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మార్కెట్ చైర్మన్ దండు నరసింహకు ఘన సన్మానం



**పెద్దకొత్తపల్లి, జూన్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దకొత్తపల్లి మండల నూతన మార్కెట్ చైర్మన్‌గా ఎన్నికైన దండు నరసింహను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాతాపూర్ గ్రామానికి చెందిన యువ కాంగ్రెస్ నాయకుడు శివ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నరసింహ నివాసానికి వెళ్లి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ గోపాల్ రావు, మాజీ సర్పంచ్ కోల సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి నారాయణరావు, జూపల్లి యువసేన నాయకులు అరిపల్లి అర్జున్ యాదవ్, కుందేల నాగేశ్, కొత్తపేట అర్జున్ సాగర్, మువ గ్రామ నాయకులు బోయ కురుమయ్య, దౌడ్ రాజు, దౌడ్ రామస్వామి, వెంకటస్వామి, ఖాసింలు తదితరులు పాల్గొన్నారు.